సాక్షి
యాదాద్రి భువనగిరి
మంగళవారం । 22 । అక్టోబర్ । 2024



వెల్లెంల ప్రాజెక్టు నింపుతాం
మరో పది రోజుల్లో బి.వెల్లెంల ప్రాజెక్టు నింపుతామని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి వెంకట్‌రెడ్డి అన్నారు. - 8లో



బాలసదన్ ఘటనపై కేసు
భువనగిరిలోని బాలసదన్‌లో అనాథ బాలికపై జరిగిన లైంగిక దాడి ఘటనపై సోమవారం కేసు నమోదైంది. - 8లో



పరిశ్రమను అడ్డుకుంటాం
రామన్నపేటలో ఏర్పాటు చేయనున్న సిమెంట్ పరిశ్రమను అడ్డుకుంటామని మాజీ ఎమ్మెల్యే లింగయ్య అన్నారు. - 9లో

న్యూస్‌రీల్

ఎస్‌ఏ-1 పరీక్షలు ప్రారంభం

భువనగిరి: జిల్లా వ్యాప్తంగా ఎస్‌ఏ-1 (సంగ్రహణాత్మక మూల్యాంకనం) పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. డీసీఈబీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 862 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 1 నుంచి 10వ తరగతి చదువుతున్న 79,761 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఉదయం 9.15 గంటల నుంచి 12 గంటల వరకు 6, 8, 10వ తరగతుల విద్యార్థులకు, మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 4.15 గంటల 7, 9వ తరగతి విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల ఈ నెల 28వ తేదీ వరకు జరగనున్నట్లు డీఈఓ సత్యనారాయణ తెలిపారు.

మహాశివుడికి విశేష పూజలు



పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో సోమవారం ఆధ్యాత్మిక పర్వాలు కొనసాగాయి. కొండపైన అనుబంధ ఆలయమైన శ్రీపర్వత వర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో రుద్రాభిషేకం, బిల్వార్చన పూజలు విశేషంగా నిర్వహించారు. మహాశివుడికి ఇష్టమైన రోజు కావడంతో అభిషేక పూజలు సంప్రదాయ పద్ధతిలో చేపట్టారు. ఇక ప్రధానాలయంలో స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు సంప్రదాయ పూజలను కొనసాగించారు. అనంతరం ఆలయంలో నిత్యకల్యాణ వేడుక, శ్రీసుదర్శన నారసింహ హోమం, జోడు సేవలు నిర్వహించారు.

29న ఓటరు ముసాయిదా జాబితా విడుదల



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్, అదనపు కలెక్టర్లు

సాక్షి, యాదాద్రి: ఈనెల 29న ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేస్తామని జిల్లా కలెక్టర్ హనుమంతు కె.జండగే తెలిపారు. గ్రాడ్యుయేట్, టీచర్స్ ఎమ్మెల్సీ స్థానాల ఓటరు జాబితా రూపకల్పన, సవరణ 2024–25కు సంబంధించి రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి సోమవారం జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్లు గంగాధర్, బెన్‌షాలోమ్‌తో కలిసి కలెక్టర్ హాజరై మాట్లాడారు. ముసాయిదాపై అభ్యంతరాలు, నూతన ఓటరు నమోదు దరఖాస్తులను నవంబర్ 29 వరకు స్వీకరిస్తామన్నారు. డిసెంబర్ 26 వరకు అభ్యంతరాలను పరిష్కరించి జనవరి 6న తుది ఓటరు జాబితా ప్రచురిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో డీఆర్‌డీఓ నాగిరెడ్డి, ఆర్డీఓ అమరేందర్ పాల్గొన్నారు.

మైనింగ్ లీజుకు అనుమతులు ఇవ్వొద్దు



కాంట్రాక్టర్‌తో వాగ్వాదం చేస్తున్న గ్రామస్తులు

వలిగొండ: మండలంలోని రెడ్లరేపాక పరిధిలో గల మణియండ్లగుట్ట మైనింగ్‌కు ప్రభుత్వం అనుమతులు ఇవ్వొద్దని ఆ గ్రామస్తులు డిమాండ్ చేశారు. మణియండ్లగుట్ట సర్వే నంబర్ 580లో భార్గవ మినరల్స్‌కు సుమారు 36 ఎకరాల విస్తీర్ణాన్ని మైనింగ్ లీజుకు ఇచ్చేందుకు సోమవారం జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ బెన్‌షాలోమ్ సమక్షంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నడుమ నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణను గ్రామస్తులు అడ్డుకుని నిరసన తెలిపారు. గ్రామంలో ప్రజల అభిప్రాయం మేరకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని చెప్పిన అధికారులు గ్రామంలో సమావేశం నిర్వహించకుండా గుట్టుచప్పుడు గాకుండా గ్రామానికి దూరంగా ప్రజాభిప్రాయ సేకరణ సభ నిర్వహించడమేంటని కాంట్రాక్టర్, అధికారులను నిలదీశారు. సభను జరగనివ్వలేదు. దీంతో అధికారులు చేసేదేమీలేక ప్రజాభిప్రాయ సేకరణను నిలిపివేశారు. ప్రజల డిమాండ్‌ను ప్రభుత్వానికి నివేదిస్తామని అదనపు కలెక్టర్ బెన్షలోమ్ గ్రామస్తులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో పర్యావరణ శాఖ ఈఈ సంగీత, చౌటుప్పల్ ఏసీపీ మధుసూదన్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, రామన్నపేట సీఐ వెంకటేశ్వర్, ఎస్‌ఐ యుగంధర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

గృహం.. త్వరలో సొంతం!



భువనగిరిలోని సింగన్నగూడెం వద్ద నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సముదాయం

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇస్తామని ఇటీవల ప్రకటించిన ప్రభుత్వం
- కొన్నిచోట్ల ఇప్పటికే లబ్ధిదారులను ఎంపిక చేసిన యంత్రాంగం
- కొన్నిచోట్ల అటకెక్కిన లక్కీ డ్రా
- తాజా ప్రకటనతో లబ్ధిదారుల్లో ఆశలు



భువనగిరిలో ధ్వంసమైన ఇళ్ల కిటికీలు, దోర్లు

సాక్షి, యాదాద్రి: జిల్లాలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లపై పేదల్లో ఆశలు చిగురిస్తున్నాయి. త్వరలోనే డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇస్తామని ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో నిరుపేదలు ఆశగా ఎదురుచూస్తున్నారు. పలుచోట్ల డబుల్ ఇళ్ల నిర్మాణాలు పూర్తయినా నేటికీ పంపిణీకి నోచుకోవడం లేదు. జిల్లా యంత్రాంగం లక్కీడ్రా ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేసి కొన్నిచోట్ల ఇళ్లు కేటాయించినా ఇంకొన్ని చోట్ల కేటాయించలేదు. త్వరలోనే పంపిణీ చేస్తామని ప్రభుత్వం అనడంతో లబ్ధిదారుల్లో ఆనందం నెలకొంది.

ఎంపిక చేసిన ప్రాంతాలివే..
భువనగిరి, ఆత్మకూర్ (ఎం), కొలనుపాక, యాదగిరిగుట్ట, తుర్కపల్లి, మోటకొండూరు, ఆలేరు, చౌటుప్పల్, నారాయణపురం తదితర మండలాల్లో డ్రా తీసి లబ్ధిదారులను ఎంపిక చేసి పంపిణీ చేయలేదు. ఆలేరు, చౌటుప్పల్, మోటకొండూరు, ఆత్మకూర్ (ఎం) మండలాల్లో లబ్ధిదారులు గృహప్రవేశం కూడా చేశారు. కానీ ఇక్కడ కనీస వసతులలేక లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇదిలా ఉంటే భువనగిరిలో సుమారు ఏడేళ్ల క్రితం నిర్మించిన ఇళ్లు శిథిలవుతున్నాయి. మౌలిక వసతుల కల్పనకు రూ.3.70 కోట్లకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినా ఇంతవరకు మోక్షం లభించలేదు.

ఇళ్ల పరిస్థితి ఇలా..
- భువనగిరి మండలం సింగన్నగూడెంలో 444 ఇళ్లను కేటాయించినా పంపిణీ చేయలేదు. మరో 116 ఇళ్లను హుస్నాబాద్ సమీపంలో నిర్మాణం చేపట్టి అసంపూర్తిగా వదిలేశారు.
- భువనగిరి మండలంలోని వడపర్తి, పగిడిపల్లి, అనంతారం గ్రామాలతోపాటు మరికొన్ని గ్రామాలకు 310 ఇళ్లు మంజూరు కాగా ఇప్పటి వరకు నిర్మాణ పనులు ప్రారంభించలేదు.

సొంతగూడు లేదు



నాకు సొంతగూడు లేదు.. అద్దె ఇంట్లో ఉంటున్నాను. నాకు ఎవరూ దిక్కులేరు. గతంలో డబుల్ బెడ్ రూమ్ ఇంటికి దరఖాస్తు చేసుకున్నాను. నాలాంటి పేద వారికి ఇల్లు ఇవ్వాలి.
– చిటుకుల లక్ష్మి, భూదాన్‌పోచంపల్లి

రెండేళ్లుగా ఎదురుచూస్తున్నాం



డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారులకు ఎంపిక చేసి రెండేళ్లు అయ్యింది. ఇళ్లు కేటాయించినా నేటికీ పంపిణీ చేయలేదు. మౌలిక వసతులు కల్పించి వెంటనే డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను అప్పగించాలి.
– ఎండీ హబీబ్, లబ్ధిదారుడు, వంగపల్లి

డబుల్ ఇళ్లు, నిర్మాణ వ్యయం వివరాలు

జిల్లాకు మంజూరైనవి	నిర్మాణం పూర్తయినవి
3,620	1000కి పైగా
ఒక్కో ఇంటికి వ్యయం (పట్టణాల్లో) రూ. 5.40 లక్షలు	
గ్రామీణ ప్రాంతాల్లో రూ. 5.04 లక్షలు	

- వలిగొండ మండలం వెల్వర్తి, నాగారం, అరూర్‌లో మొత్తం 80 ఇళ్లు మంజూరైనా ఎవరూ టెండర్లు వేయలేదు.
- బీబీనగర్ మండలం కొండమడుగులో 30, బీబీనగర్‌లో 30 ఇళ్లకు 11 పూర్తి కాగా కొండమడుగులో 30 పూర్తి చేశారు. మిగిలినవి పిల్లర్ల దశలో ఉన్నాయి.
- భూదాన్‌పోచంపల్లి మండలానికి 184 మంజూరు కాగా పోచంపల్లికి 120, జిబ్లక్‌పల్లికి 36, దేశ్‌ముఖ్ 30 ఇళ్లు కేటాయించారు. ఇందులో పోచంపల్లి 60, జిబ్లక్‌పల్లిలో 36 పూర్తికాగా వీటిని ఎవరికి కేటాయించలేదు. మిగిలినవి అసంపూర్తిగా ఉన్నాయి. దేశ్‌ముఖ్‌లో స్థలం లభించలేదు.
- చౌటుప్పల్ మండలం దండుమల్కాపురంలో 72 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మించారు. మొత్తం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. 66 మంది ఇళ్లలో నివసిస్తున్నా వారికి వసతులు లేవు.
- యాదగిరిగుట్ట మండలం వంగపల్లి, మాసాయిపేట గ్రామాల్లో 80 ఇండ్లను నిర్మించారు. లబ్ధిదారులను ఎంపిక చేసినా వారికి అందజేయలేదు.

కిరాయి ఇంట్లో ఉంటున్న..



కొన్ని సంవత్సరాలుగా కిరాయి ఇంట్లో ఉంటున్నాం. ఏడాది క్రితం ఇంటి అద్దె కూడా పెంచారు. గత ప్రభుత్వం కేటాయించిన ఇల్లు ఇస్తే బాగుండు. డబుల్ ఇళ్ల పంపిణీపై అధికారులు స్పందించాలి.
– శిరీష, లబ్ధిదారు, భువనగిరి

ఇళ్లు ధ్వంసమవుతున్నాయి



కొన్ని సంవత్సరాల క్రితం నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు పూర్తిగా ధ్వంసమవుతున్నాయి. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. కనీస వసతుల్లేక ఇళ్లలోకి వెళ్లలేకపోతున్నాం.
– మసూద్, లబ్ధిదారుడు, భువనగిరి

● సలామ్ పోలీసన్న



పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా సోమవారం ఆత్మకూరు(ఎం) పోలీస్ స్టేషన్‌లో అమర పోలీసుల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న ఎస్‌హెచ్‌ఓ సొల్మన్‌రాజు, సిబ్బంది

అర్జీలు పెండింగ్ పెట్టొద్దు

- త్వరితగతిన పరిష్కరించాలి
- ప్రజావాణిలో కలెక్టర్ హనుమంతు కె.జెండగే

భువనగిరి టౌన్: ప్రజావాణికి వచ్చిన అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా త్వరగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ హనుమంతు కె.జెండగే జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం భువనగిరి కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజల నుంచి పలు సమస్యలపై 61దరఖాస్తులను స్వీకరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలోఅదనపు కలెక్టర్ గంగాధర్, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ జగన్నాథరావు, జిల్లా ముఖ్య కార్యనిర్వహణ అధికారి శోభారాణి, డీఆర్‌డీఓ నాగిరెడ్డి, సుపరింటెండెంట్ పార్థ సింహారెడ్డి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వచ్చిన అర్జీలలో కొన్ని..
- నూతన విద్యా విధానం ఎన్‌పీడీ- 2020ను రద్దు చేయాలని ఏఐఎస్‌ఎఫ్ నేత ఉప్పల శాంతికుమార్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు.
- జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకుల విద్యార్థులకు 8 నెలల నుంచి మెస్చార్ రాకపోవడంతో పౌష్టికాహారం అందడం లేదని వెంటనే విడుదల చేయాలని తెలంగాణ సోషలిస్ట్ స్టూడెంట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కూరెళ్ల మహేష్ కుమార్ వినతి పత్రం అందజేశారు.
- బొమ్మలరామారం మండలం రామలింగంపల్లి గ్రామ సర్పంచ్ రిజర్వేషన్ పారదర్శకంగా అమలు చేయాలని సమాచార హక్కు వికాస సమితి కార్యదర్శి యాదగిరి వినతిపత్రం అందజేశారు.
- భువనగిరిలోని రామ్‌నగర్ వార్డు నంబర్–9 మంజునాథ చౌరస్తాలో మున్సిపల్ రోడ్డును ఆక్రమించి గణేష్ మండపాన్ని నిర్మించారని వెంటనే తొలగింపజేలని పలువురు కోరారు.
- జీఓ నంబర్ 18 ద్వారా బీసీ కులాలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించేందుకు ఏ, బీ, సీ, డీ ఉప వర్గీకరణ అమలు చేయాలని తెలంగాణ బీసీ ఫెడరేషన్ కులాల సమితి ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో శ్రీనివాస్, నరసింహ గౌడ్, నరసింహాచారి, మహేందర్‌లు పాల్గొన్నారు.
- భువనగిరిలోని రాయిగిరి రెవెన్యూ పరిధిలో ముదిరాజు కులదైవం పెద్దమ్మ దేవాలయం, ముదిరాజుల శ్మశాన వాటికకు వెళ్లేందుకు బాట సౌకర్యం కల్పించాలని ముదిరాజ్ సంఘం నాయకులు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏర్పాల వెంకటేశం, అంకర్ల సంజీవ, డాక్టర్ బాలరాజు తదితరులు ఉన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ హనుమంతు కె.జెండగే, అధికారులు

సీడీపీఓ వేధింపులతో ఒత్తిడికి గురవుతున్నాం



నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

- మోత్కూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ మాకొద్దు
- పలువురు అంగన్‌వాడీ టీచర్ల ఆవేదన

మోత్కూరు: సీడీపీఓ.. తరచూ తమను వేధిస్తూ.. తీవ్ర పరుష పదజాలంతో దూషిస్తుండడంతో మానసికంగా ఒత్తిడికి గురవుతున్నామని మోత్కూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని పలువురు అంగన్‌వాడీ టీచర్లు ఆరోపించారు. మోత్కూరు మండలం దాచారం అంగన్‌వాడీ కేంద్రం–1 టీచర్ లక్ష్మీరాజ్యం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందగా మృతదేహాన్ని ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లు సందర్శించారు. అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు పంతుల శోభ సమక్షంలో పలువురు టీచర్లు మాట్లాడుతూ గత రెండు నెలల క్రితం లక్ష్మీరాజ్యం కేంద్రాన్ని పీడీ, సీడీపీఓ సందర్శించి ఆమెను దూషించారని పేర్కొన్నారు. మరుసటి రోజు ఆగస్టు 28న ప్రాజెక్టు మీటింగ్‌లో కూడా లక్ష్మీరాజ్యాన్ని సీడీపీఓ మరోమారు దూషించడంతో అదే ఆలోచన పెట్టుకున్న ఆమె బైక్‌పై వెళుతుండగా ప్రమాదవశాత్తు జారి పడి తీవ్ర గాయాల పాలైందన్నారు. అప్పటి నుంచి హైదరాబాద్‌లోని యశోద, గాంధీ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతూ వచ్చిన లక్ష్మీరాజ్యం సోమవారం మరణించిందని తెలిపారు. అంగన్‌వాడీ టీచర్ల పట్ల సీడీపీఓ దురుసుగా ప్రవరిస్తూ అసభ్య పదజాలంతో దూషిస్తోందని వాపోయారు. సీడీపీఓ వేధింపులతో మోత్కూరులో ఒక టీచర్, మానాయికుంటలో మరో టీచర్ మనో వేదనతోటి చనిపోయారన్నారు. మరో పదిమంది టీచర్లు రాజీనామాలు చేశారన్నారు. ఈ సీడీపీఓ మాకొద్దని టీచర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లు మందడి ఉపేంద్ర, బయ్యని భారతి, భాగ్యలక్ష్మి, సునీత, విజయ, వరమ్మ, జానమ్మ, జయశ్రీ, నర్మద, శోభ,పిచ్చమ్మ, వెంకటమ్మ పాల్గొన్నారు.

మూసీ ప్రక్షాళనపై అఖిలపక్ష కమిటీ వేయాలి

ఆలేరు రూరల్: మూసీనది సుందరీకరణ, ప్రక్షాళనపై అఖిలపక్షంతో కమిటీ వేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ.జహంగీర్ డిమాండ్‌చేశారు. సోమవారం ఆలేరు పట్టణ కేంద్రంలోని వైఎస్‌ఎన్ గార్డెన్ ఏర్పాటు చేసిన మున్సిపల్ పట్టణ మహాసభలో ఆయన మాట్లాడారు. మూసీనది సుందరీకరణ చేసే ముందు, రాష్ట్ర ప్రభుత్వం ప్రజాభిప్రాయ సేకరణతో పాటు రాజకీయపార్టీలతో చర్చించాలని డిమాండ్ చేశారు. మూసీనది వెంట పేదలు ఇళ్లు కట్టుకుని అరవై సంవత్సరాలుగా జీవనం కొనసాగిస్తున్నారని తెలిపారు. బఫర్ జోన్ కింద ఉన్న నివాసాలను ఖాళీచేయమనడం అన్యాయమన్నారు. సమావేశంలో మాటూరి బాలరాజు, ఎంఏ ఇక్బాల్, జయరాములు, గడ్డం వెంకటేష్, దూపటి వెంకటేష్, రమేష్, మల్లేషం, యాదగిరి రాజేష్, నరేష్, విప్లవ్, నవీన్, నాగరాజు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత ఖిలాగా తీర్చిదిద్దుకుందాం



భువనగిరి ఖిలాపై స్వచ్ఛ భారత్‌లో పాల్గొన్న విద్యార్థులు

భువనగిరి: పర్యాటకపరంగా అభివృద్ధి చెందుతున్న భువనగిరి ఖిలా రానున్న రోజుల్లో ప్లాస్టిక్ రహిత ఖిలాగా తీర్చిదిద్దుకుందామని జిల్లా పర్యాటక శాఖ అధికారి కె.ధనుంజనేయులు అన్నారు. ఇంక్రెడిబుల్ ఇండియా, మినిస్ట్రీ ఆఫ్ టూరిజం, ట్రాన్సెండ్ అడ్వెంచర్ సంయుక్త ఆధ్వర్యంలో భువనగిరి ఖిలాపై సోమవారం చేపట్టిన స్వచ్ఛభారత్ కార్యక్రమంలో మాట్లాడారు. కార్యక్రమంలో ట్రాన్సెండ్ అడ్వెంచర్ అకడమిక్ మేనేజర్ రాకేష్, సిబ్బంది వినోద్, జూనియర్ కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఆధార్ తరహాలో 'అపార్'





భువనగిరిలో తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

- విద్యార్థులకు అందించాలని కేంద్రం నిర్ణయం
- వారి సమగ్ర సమాచారం అందులోనే..
- తల్లిదండ్రుల అంగీకారంతో తీసుకోవాలని ఆదేశం
- ఇప్పటికే తల్లిదండ్రులకు అవగాహన
- జిల్లాలో 712 స్కూళ్లు.. 79,761 మంది విద్యార్థులు

భువనగిరి: జాతీయ విద్యా విధానం అమలులో భాగంగా ఒక దేశం–ఒక విద్యార్థి ఐడీ నినాదంతో కేంద్ర ప్రభుత్వం విద్యార్థులకు ఆధార్ కార్డు తరహాలో అపార్ (ఏపీఏఏఆర్–ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) కార్డు అందించాలని నిర్ణయించింది. అపార్ పేరుతో కార్డు ఇచ్చేందుకు గత ఏడాది కేంద్ర ప్రభుత్వం ఆదేశాలిచ్చినా అమలు కాలేదు. తాజాగా మళ్లీ ఆదేశాలు రావడంతో ఈ నెల 19న పాఠశాలల్లో జరిగిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశంలో అవగాహన కల్పించారు. ఆధార్ తరహాలో దేశంలోని ప్రతి విద్యార్థికి 12 అంకెలతో కూడిన ఒక ఐడీ సంఖ్యను కేటాయించి అపార్ కార్డు ఇవ్వనున్నారు. ఇందులో విద్యార్థి సమగ్ర సమాచారాన్ని పొందుపరుస్తారు.

జిల్లాలో 79,761 మంది విద్యార్థులు
జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు మొత్తం 862 ఉండగా వీటిలో 79,761 మంది విద్యార్థులున్నారు. ప్రభుత్వ పాఠశాలలు 712 ఉండగా ఇందులో 38,548, ప్రైవేట్ పాఠశాలలు 150 ఉండగా వీటిలో 41,213 మంది విద్యార్థులున్నారు. వీరితో పాటు కళాశాలలకు చెందిన విద్యార్థుల సైతం ఉన్నారు. ఇప్పటి వరకు పాఠశాల, కళాశాల స్థాయిలో వేర్వేరుగా ఐడీ కార్డులను కేటాయించేవారు. వీటి స్థానంలో అపార్ కార్డు వస్తే ఆ కార్డులో సమగ్ర సమాచారం ఉండనుంది.

జీవితకాల ఐడీగా..
విద్యార్థులకు అందజేయనున్న అపార్ కార్డు 12 అంకెల సంఖ్య విద్యార్థి జీవిత కాల ఐడీగా పరిగణనలోకి తీసుకోనున్నారు. ఈ కార్డులను ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులతో పాటు ప్రైవేట్ పాఠశాలల విద్యార్థుల సైతం కేటాయించనున్నారు. ఈ కార్డులో విద్యార్థి పేరు, పుట్టిన తేదీ, లింగం, ఫొటో, క్యూఆర్ కోడ్, కేజీ టూ పీజీ విద్యా సంవత్సరం వివరాలు, సాధించిన విజయాలు, స్కాలర్‌షిప్‌లు, మెమోలు, ధ్రువపత్రాలతోపాటు ఆధార్ అనుసంధానం ఉండడంతో కుటుంబ వివరాలు పొందుపరుస్తారు. విద్యార్థి ఖాతా డీజీ లాకర్‌తో అనుసంధానమై ఉంటుంది. దీంతో విద్యా సంస్థల ప్రవేశాలు, ప్రవేశ పరీక్షలకు, ఉద్యోగాలకు ఐడీ నమోదు చేస్తే వివరాలు తెలుసుకోవడం సులభంగా ఉంటుంది.

తల్లిదండ్రుల అంగీకారంతోనే ప్రక్రియ
అపార్ కార్డు వివరాలను గోప్యంగా ఉంచనున్నారు. అపార్ కార్డు మంజూరుపై తల్లిదండ్రుల అంగీకారం తప్పనిసరిగా తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటికే చాలా వరకు తల్లిదండ్రులు కార్డు కోసం అంగీకారం తెలిపినట్లు సమాచారం. విద్యార్థి ఆధార్, బోనోఫైడ్ వివరాలు అక్షరం తప్పు లేకుండా ఉంటనే అపార్ సంఖ్య జనరేట్ అవుతుంది. ఒకసారి కార్డు వచ్చిందంటే మార్పులకు అవకాశం ఉండదు.

తల్లిదండ్రుల అంగీకారంతో కార్డులివ్వాలని సూచించాం..
అపార్ కార్డు ఇచ్చేందుకు ముందుగా విద్యార్థుల తల్లిదండ్రుల అంగీకారం తీసుకోవాల్సి ఉంటుంది. ఇందు కోసం గత శనివారం పాఠశాలల్లో తల్లిదండ్రుల సమావేశాలే ఏర్పాటు చేశారు. వారి అభిప్రాయాలు తీసుకోవడంతో పాటు అవగాహన కల్పించారు. ఈ ప్రక్రియ పూర్తికి హెచ్‌ఎంలకు ఆదేశాలు ఇచ్చాం.
– సత్యనారాయణ, డీఈఓ, యాదాద్రి భువనగిరి

అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు

భువనగిరి: అడ్వాన్స్ డ్ టెక్నాలజీ సెంటర్ ప్రభుత్వం ఐటీఐ ఆలేరులో ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా యువజన క్రీడల అభివృద్ధి అధికారి కె ధనుంజనేయులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా ఈనెల 30 లోపు దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు. మ్యాన్‌ఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ అండ్ ఆటోమేషన్, ఇండస్ట్రీయల్ రోబోటిక్, ఆర్టిజన్ యూసింగ్ అడ్వాన్స్‌డ్ టూల్, బేసిక్ డిజైనర్ అండ్ వర్చువల్ వెరిఫియర్ కోర్సులు ఉన్నాయని తెలిపారు. పూర్తి వివరాలకు ప్రిన్సిపాల్ బి.హరికృష్ణ సెల్ : 9866843920 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి



ఆందోళన చేస్తున్న ఏబీవీపీ నాయకులు, విద్యార్థులు

భువనగిరి: రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజురీయింబర్స్‌మెంట్ నిధులు వెంటనే విడుదల చేయాల చేయాలని ఏబీవీపీ ఉమ్మడి నల్లగొండ జిల్లా విభాగ్ కన్వీనర్ సుర్వి మణికంఠ డిమాండ్ చేశారు. సోమవారం ఏబీవీపీ భువనగిరి శాఖ ఆధ్వర్యంలో భువనగిరి పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్కాలర్‌షిప్, ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదల విషయంలో ప్రభుత్వ వైఖరిని ఖండిస్తూ ప్రిన్స్‌చౌరస్తా వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో స్టీరింగ్ కమిటి సభ్యులు జూపల్లి దీపిక,హరీష్, నల్లవల్లి శివకుమార్,సాయికుమార్, నీలకంఠ, అభి, హర్షవర్ధన్,పవన్, గణేష్, సాయి,మధు, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

డిగ్రీ ఫీజు చెల్లింపు గడువు పొడిగింపు

నల్లగొండ రూరల్: డిగ్రీ సెమిస్టర్ ఫీజు చెల్లింపు గడువును ఈ నెల 28వ తేదీ వరకు పొడిగించినట్లు మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి ఉపేందర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అదేవిధంగా ఈ నెల 30వ తేదీ వరకు అపరాధ రుసుముతో ఫీజు చెల్లించవచ్చన్నారు.

మద్యం సీసాలు, నాటుసారా ధ్వంసం



మద్యం సీసాలు, నాటుసారాని ధ్వంసం చేయిస్తున్న ఎక్సైజ్ అధికారులు, పోలీసులు

గరిడేపల్లి: గత అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల సమయాల్లో 48 కేసుల్లో పట్టుబడిన మద్యం సీసాలను, నాటుసారాని సూర్యాపేట జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ అనుమతితో సోమవారం గరిడేపల్లి మండల కేంద్రంలో హుజూర్‌నగర్ ఎక్సైజ్ ఎస్‌ఐ వెన్నెల, ఎస్‌ఐ నరేష్ సమక్షంలో ధ్వంసం చేశారు. కార్యక్రమంలో ఎక్సైజ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బైక్‌లు చోరీ చేస్తున్న వ్యక్తి అరెస్ట్



నిందితుడి నుంచి స్వాధీనం చేసుకున్న బైక్‌లను చూపుతున్న పోలీసులు

భువనగిరి క్రైం: బైక్‌లు చోరీ చేస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేసి ఏడు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. భువనగిరి పట్టణ ఎస్‌ఐ సుధీర్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా బిక్కనూరు మండలం కంచెర్ల గ్రామానికి చెందిన కొక్కు గణేష్ నంబర్ ప్లేట్ లేని బైక్‌పై సోమవారం భువనగిరి వైపు వస్తుండగా.. భువనగిరి పట్టణంలో వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు అతడిని ఆపేందుకు ప్రయత్నించారు. కానీ అతడు బైక్‌ను ఆపకుండా పారిపోయేందుకు ప్రయత్నించగా పోలీసులు పట్టుకుని విచారించారు. ఈ విచారణలో భాగంగా గణేష్ పలు ప్రాంతాల్లో ఏడు బైక్‌లను దొంగిలించాడని, దొంగిలించిన బైక్‌లను తన అత్తగారి ఊరైన నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలం గారకుంటపాలెం గ్రామంలో దాచిపెట్టినట్లు వెల్లడించాడు. గారకుంటపాలెం నుంచి ఏడు బైక్‌ను స్వాధీనం చేసుకుని గణేష్‌ను అరెస్ట్ చేసి రిమాండ్ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పది రోజుల్లో వెల్లెంల ప్రాజెక్టు నింపుతాం

- రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- నూతన గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణానికి శంకుస్థాపన



ఖాజీ రామారంలో గ్రామ పంచాయతీ భవనానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి కోమటిరెడ్డి



మాడ్గులపల్లిలో గ్రామ పంచాయతీ భవనానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి కోమటిరెడ్డి



ఖాజీరామారంలో బైక్‌పై వెళ్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ రూరల్: మరో 10 రోజుల్లో బ్రాహ్మణ వెల్లెంల ప్రాజెక్టు నింపుతామని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం నల్లగొండ మండలం ఖాజీరామారంలో రూ.20లక్షలతో నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు. అదేవిధంగా ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బి.వెల్లెంల కాల్వ ద్వారా చెరువులు నింపుతామన్నారు. కాల్వలు తవ్వేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. రైతులకు ఇబ్బంది లేకుండా గ్రామంలో మౌలిక వసతుల ఏర్పాటుకు రూ.10లక్షలు కేటాయిస్తున్నట్లు తెలిపారు. ఖాజీరామారం గ్రామానికి గతంలో బీటీ రోడ్డు, సబ్ స్టేషన్ నిర్మించానని, డీ–39 కాల్వలో కంపచెట్లు తొలగించి దిగువకు నీరు వెళ్లే విధంగా చేశానన్నారు. నల్లగొండ నియోజకవర్గానికి నాలుగు వేల ఇందిర్మ ఇళ్లు మంజూరయ్యాయని ఇందులో ఖాజీరామారం గ్రామానికి 50 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. గ్రామ పంచాయతీ భవనంపై మరో అంతస్తు నిర్మించేందుకు ఎమ్మెల్యే నిధుల నుంచి మరో రూ.20 లక్షలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వం ఎస్‌ఎల్‌బీసీ సొరంగ మార్గాన్ని పట్టించుకోలేదని తాను ముఖ్యమంత్రితో మాట్లాడి నిధులు మంజూరు చేయించానని, 24 నెలల్లో సొరంగాన్ని పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. రూ.కోటితో పావురాలగూడేనికి రహదారి మంజూరు చేశామన్నారు. ఖాజీరామారం పాఠశాలను మోడల్ పాఠశాలగా తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ షబ్బీర్‌బాబా, ఆర్డీఓ శ్రీదేవి, జిల్లా పంచాయతీ అధికారి మురళి, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ సత్యనారాయణరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ వెంకటేశ్వర్లు, మాజీ జెడ్పీటీసీ లక్ష్మయ్య, పాశం రాంరెడ్డి, నల్లగొండ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, మాజీ ఎంపీపీ నారాయణరెడ్డి పాల్గొన్నారు.

పేదల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

వేములపల్లి(మాడ్గులపల్లి): రాష్ట్రంలోని పేదల కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి వారి అభివృద్ధికి కృషి చేస్తుందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం మాడ్గులపల్లి మండల కేంద్రంలో రూ.50లక్షలతో నిర్మించనున్న గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పడిన కేవలం పది నెలల్లోనే రైతు రుణమాఫీ చేశామని, ఇంకా పెండింగ్ ఉన్న వారికి డిసెంబర్ 9వ తేదీ లోపు పూర్తి చేస్తామన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం లక్షల కోట్ల అప్పులు తీసుకొచ్చారని, వాటికి వడ్డీలు కట్టడమే కాంగ్రెస్ ప్రభుత్వానికి సరిపోతుందన్నారు. మాడ్గులపల్లి మండల కేంద్రంలో మూడెకరాల ప్రభుత్వ స్థలంలో ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాలు, పోలీస్ స్టేషన్ నిర్మాణాలు త్వరలో చేపడతామని అన్నారు. మాడ్గులపల్లి–మామిడాల వరకు డబుల్ రోడ్డు పనులను ప్రారంభించామని అదే విధంగా చిరుమర్తి–సూర్యాపేట వరకు త్వరలో డబుల్ రోడ్డు నిర్మించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మిర్యాలగూడ సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ్, ఎంపీడీఓ స్వామి, తహసీల్దార్ పద్మ, డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్, మాజీ జెడ్పీటీసీ పుల్లెంలల సైదులు, మండల పార్టీ అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, నరసింహ, సైదిరెడ్డి, వెంకన్న, పురుషోత్తంరెడ్డి, నరేష్, యాదయ్య, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

పండుగ ముగిసినా.. ప్రత్యేక చార్జీలే!

- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రయాణికులు



మిర్యాలగూడ డిపో సూపర్ లగ్జరీ బస్సు స్పెషల్

మిర్యాలగూడ టౌన్: స్పెషల్ బస్సుల పేరుతో ఆర్టీసీ యాజమాన్యం అధిక చార్జీలు వసూలు చేస్తోందని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మిర్యాలగూడ నుంచి హైదరాబాద్‌కు సూపర్ లగ్జరీ బస్సులో సాధారణంగా ఒక్కరికి రూ.290 చార్జీ ఉండగా.. సోమవారం సూపర్ లగ్జరీ బస్సుకు స్పెషల్ బస్సు అని బోర్డు ఏర్పాటు చేసి రూ.400 వరకు వసూలు చేశారని ప్రయాణికులు మండిపడుతున్నారు. రాజధాని ఏసీ బస్సులో మాత్రం ఎప్పటిలాగే రూ.370 వసూలు చేస్తున్నారని ప్రయాణికులు అంటున్నారు. అంతేకాకుండా మిర్యాలగూడ డిపోకు చెందిన బస్సు నంబర్ ఒకటి ఉంటే టికెట్‌పై మరో నంబర్ ఉండటంతో చర్చనీయాంశంగా మారింది. ఎలాంటి కారణాలు లేకుండా చార్జీలు ఎలా పెంచుతారని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచితంగా ప్రయాణం కల్పించగా.. పల్లె వెలుగు బస్సులకు ఎక్స్‌ప్రెస్ బోర్డులు ఏర్పాటు చేసి తిప్పుతుండడంతో ఆ బస్సులు ప్రయాణికులతో కిటకిటలాడుతున్నారు. ఈ విషయంపై మిర్యాలగూడ ఆర్టీసీ డిపో మేనేజర్ రాంమోహన్‌రెడ్డిని వివరణ కోరగా.. మిర్యాలగూడ డిపో నుంచి కేవలం రెండు స్పెషల్ బస్సులు మాత్రమే నడుపుతున్నామని, మిగిలిన బస్సుల్లో సాధారణ చార్జీలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అదనంగా బస్సులు వేసినప్పుడు మాత్రమే ఆర్టీసీ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చార్జీలు పెంచాల్సి వస్తుందని పేర్కొన్నారు.



రూ.400 టిక్కెట్

బిక్కేరు వాగులో ఈతకు వెళ్లి బాలుడు మృతి



మనీశ్వర్ (ఫైల్)

నాగారం: సెలవు రోజున సరదాగా స్నేహితులతో కలిసి వాగులోకి ఈతకు వెళ్లిన బాలుడు నీటి ప్రవాహంలో కొట్టుకుపోయి మృతిచెందాడు. ఈ ఘటన నాగారం మండలం వర్ధమానుకోటలో సోమవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు, మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. వర్ధమానుకోట గ్రామానికి చెందిన ఖమ్మంపాటి నాగరాజు, ఉపేంద్ర దంపతులకు ముగ్గురు కుమారులు. పెద్ద కుమారుడు మనీశ్వర్ (11) గ్రామంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో 6వ తరగతి చదువుతున్నాడు. ఆదివారం పాఠశాలకు సెలవు దినం కావడంతో మధ్యాహ్న సమయంలో గ్రామానికి చెందిన మరో ముగ్గురు స్నేహితులతో కలిసి మనీశ్వర్ గ్రామ శివారులోని బిక్కేరు వాగులోకి ఈతకు వెళ్లాడు. బిక్కేరువాగు వద్ద నిర్మించిన చెక్‌డ్యాం వద్ద మనీశ్వర్, అతడి స్నేహితులు ఈత కొడుతుండగా నీటి ఉధృతి ఎక్కువగా ఉండడంతో మనీశ్వర్ ఈత రాక నీటిలో కొట్టుకుపోయాడు. తోటి స్నేహితులు భయాందోళనకు గురై విషయం ఎవరికీ చెప్పకుండా ఎవరి ఇంటికి వాళ్లు వెళ్లిపోయారు. సాయంత్రమైనా మనీశ్వర్ ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు చుట్టుపక్కల వెతకగా ఆచూకీ లభ్యం కాలేదు. మనీశ్వర్ స్నేహితులను ప్రశ్నించగా వారు తమకేమీ తెలియదని చెప్పారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు గ్రామానికి చేరుకుని మనీశ్వర్ స్నేహితులను గట్టిగా అడగడంతో బిక్కేరువాగులో నీటి ప్రవాహానికి కొట్టుకుపోయాడని చెప్పారు. దీంతో మనీశ్వర్ తల్లిదండ్రులు, గ్రామస్తులు బిక్కేరు వాగు వద్దకు చేరుకుని ఆదివారం అర్ధరాత్రి వరకు నీటిలో గాలించినా అతడి ఆచూకీ లభించలేదు. సోమవారం ఉదయం మరోసారి బిక్కేరు వాగులో గాలించగా మనీశ్వర్ మృతదేహం నీటిపై రాళ్ల మధ్య ఇరుక్కుపోయి కనిపించింది. మృతదేహాన్ని నీటి నుంచి బయటకు తీశారు. పోలీసులు మనీశ్వర్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తుంగతుర్తిలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాలుడి తండ్రి ఖమ్మంపాటి నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు నాగారం ఎస్‌ఐ ఎం. ఐలయ్య తెలిపారు.

అమ్మమ్మ ఇంటి వద్ద అంత్యక్రియలు..

ఖమ్మంపాటి నాగరాజుది రెక్కాడితే గానీ డొక్కాడని కుటుంబం. రెండేళ్ల కిత్రం తన తండ్రికి యాదగిరికి రెండు కిడ్నీలు చెడిపోవడంతో గ్రామంలో ఉన్న ఇళ్లు, ఎకరం పొలం అమ్మి వైద్యం చేయించగా అతడు చనిపోయాడు. అప్పటి నుంచి అద్దె ఇంట్లోనే ఉంటున్నారు. నాగరాజు వైన్ షాపులో పనిచేస్తుండగా, అతడి ఉపేంద్ర కూలీ పనులు చేస్తూ తమ ముగ్గురు పిల్లల్ని చదివిస్తున్నారు. ఇంతలోనే తమ పెద్ద కుమారుడు మనీశ్వర్ ఈతకు వెళ్లి మృత్యువాత పడటంతో వారి రోదనలు మిన్నంటాయి. కిరాయి ఇంట్లో అంత్యక్రియలు చేయలేని పరిస్థితి ఉండటంతో మనీశ్వర్ అమ్మమ్మ గ్రామమైన నాగారం బంగ్లాలో అంత్యక్రియలు నిర్వహించారు.

మీరుంటానంటేనే క్వార్టర్స్ నిర్మించాం

- నేను యూనివర్సిటీలోనే ఉంటాను.. మీరూ ఉండాల్సిందే
- అధ్యాపకులను ఆదేశించిన ఎంజీయూ వీసీ అల్తాఫ్ హుస్సేన్



అధ్యాపకులతో సమావేశమైన ఎంజీయూ వైస్ చాన్స్‌లర్ అల్తాఫ్ హుస్సేన్

నల్లగొండ రూరల్: 'మీరుంటానంటేనే గతంలో నేను ఇక్కడ వీసీగా ఉన్న సమయంలో క్వార్టర్స్ నిర్మాణం చేశాను.. నేను ఇక్కడే ఉంటాను.. మీరు కూడా ఇక్కడే ఉండాల్సిందే' అని మహాత్మాగాంధీ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ అల్తాఫ్ హుస్సేన్ అధ్యాపకులను ఆదేశించారు. సోమవారం యూనివర్సిటీలో అధ్యాపకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంజీయూకి న్యాక్ ఏ గ్రేడ్ వచ్చేలా అధ్యాపకులంతా సమష్టిగా కృషి చేయాలని అన్నారు. అధ్యాపకులు ప్రతి విద్యార్థిని విజ్ఞానవంతుడిగా తయారుచేసి జాతీయ స్థాయిలో పోటీపడేలా తీర్చిదిద్దాలన్నారు. అధ్యాపకులు, విద్యార్థులు సమయపాలన పాటించాలని అందుకోసం బయోమెట్రిక్ అమలు చేయాలన్నారు. 75శాతం హాజరుంటేనే విద్యార్థులను పరీక్షలకు అనుమతించాలన్నారు. మూల్యాంకనాలు పారదర్శకంగా నిర్వహించాలన్నారు. విద్యార్థులు హాస్టళ్లలో ఉండకుండా తరగతులకు హాజరయ్యేలా అధ్యాపకులే పర్యవేక్షించాలన్నారు. ఏజెన్సీల దగ్గర పరిశోధనా పత్రాలు తెచ్చిన వారికి పీహెచ్‌డీ పట్టాలు ఇవ్వవొద్దన్నారు. యూనివర్సిటీని మరింత అభివృద్ధి చేసేందుకు కృషిచేస్తామన్నారు. గతంలో తాను వీసీగా సమర్థవంతంగా పనిచేసిన కారణంగానే మరోసారి తనకు వీసీగా అవకాశం వచ్చిందన్నారు. సమావేశంలో రిజిస్ట్రార్ రవి, ఓఎస్‌డీ అంజిరెడ్డి, ప్రిన్సిపాల్స్ అరుణప్రియ, సుధారాణి, ఎంవీఎస్ రెడ్డి, ప్రేమ్‌సాగర్, డీన్‌లు సరిత, వసంత, రేఖ, రవి, రమేష్, మాధురి, మద్దిలేటి, ఉపేందర్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు చెరువులో మునిగి వ్యక్తి మృతి

మునగాల: మండలంలోని ఆకుపాముల గ్రామంలో సోమవారం ప్రమాదవశాత్తు చెరువులో మునిగి ఓ వ్యక్తి మృతిచెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆకుపాముల గ్రామానికి చెందిన పచ్చిపాల కోటయ్య(45) వ్యవసాయ కూలీగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం తన గేదెను మేపేందుకు గ్రామ శివారులోని కాముకుంట చెరువు వద్దకు వెళ్లాడు. గేదె చెరువు లోపలకు వెళ్లి బయటకు రాకపోవడంతో కోటయ్య ఈత కొట్టుకుంటూ చెరువు మధ్యలోకి వెళ్లాడు. ఈ క్రమంలో తన లుంగీ కాళ్లకు చుట్టుకోవడంతో నీటిలో మునిగి ప్రాణాలు కోల్పోయాడు. చెరువు పరిసర ప్రాంతాల్లో ఉన్న పలువురు గమనించి గ్రామంలోకి వచ్చి గ్రామస్తులకు సమాచారం ఇచ్చారు. చెరువు వద్దకు చేరుకున్న గ్రామస్తులు ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి నీటిలో మునిగి ఉన్న కోటయ్య మృతదేహాన్ని బయటకు తీసి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ప్రయాణికురాలి బ్యాగు చోరీ

- సీసీ కెమెరాల సహాయంతో బ్యాగును కనిపెట్టి బాధితురాలికి అప్పగించిన పోలీసులు

భువనగిరి క్రైం: ఆర్టీసీ బస్సులో వెళ్తున్న ప్రయాణికురాలి బ్యాగు చోరీకి గురికాగా.. పోలీసులు బ్యాగును కనిపెట్టి బాధితురాలికి అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని అంబర్‌పేట గంగానగర్ కాలనీకి చెందిన గజ్జి జ్యోతి తన భర్త మధుతో కలిసి దసరా పండుగకు తన తల్లిగారి ఊరైన మహబూబ్‌నగర్ జిల్లా కేససముద్రంకు వెళ్లింది. పండుగ అనంతరం ఈ నెల 14వ తేదీన తిరిగి హైదరాబాద్‌కు వస్తున్న క్రమంలో తొర్రూర్ బస్టాండ్‌లో ఆమె ఆర్టీసీ బస్సు ఎక్కింది. మార్గమధ్యలో తన బ్యాగు కనిపించకపోవడంతో భువనగిరి పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆ బ్యాగులో 7 తులాల బంగారు ఆభరణాలు ఉన్నట్లు బాధితురాలు పేర్కొంది. పోలీసులు భువనగిరి బస్టాండ్‌లో సీసీ కెమెరాలను పరిశీలించగా.. ఓ ప్రయాణికుడు పొరపాటున తన బ్యాగుకు బదులు బాధితురాలి బ్యాగుతో బస్టాండ్ దిగినట్లు గుర్తించారు. సదరు ప్రయాణికుడు బస్సు దిగిన తర్వాత బ్యాగు తనది కాదని గుర్తించి దానికి బస్టాండ్‌లోనే వదిలి వెళ్లిపోయాడు. ఎవరూ బ్యాగును తీసుకోకపోవడంతో మరో మహిళా ప్రయాణికురాలు ఆ బ్యాగును తన వెంట తీసుకెళ్లింది. ఆ బ్యాగును తీసుకెళ్లిన మహిళను గుర్తించి బ్యాగు, అందులోని బంగారు వస్తువులను స్వాధీనం చేసుకుని సోమవారం బాధితురాలు జ్యోతికి పోలీసులు అప్పగించినట్లు పట్టణ సీఐ కె. సురేష్‌కుమార్ తెలిపారు.

స్నేహితుడి పెళ్లి ఊరేగింపులో డ్యాన్స్ చేసి..

- ఇంటికొచ్చి నిద్రలోనే గుండెపోటుతో యువకుడి మృతి



సతీష్ (ఫైల్)

నడిగూడెం : స్నేహితుడి పెళ్లి ఊరేగింపులో డ్యాన్స్ చేసి ఆ తర్వాత ఇంటికి వెళ్లి పడుకొని నిద్రలోనే గుండెపోటుతో యువకుడు మృతిచెందాడు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా నడిగూడెం మండలం సిరిపురంలో సోమవారం తెల్లవారు జామున జరిగింది. గ్రామస్తులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన కేసగాని ఉపేందర్ కుమారుడు కేసగాని సతీష్ (27) తన స్నేహితుడి పెళ్లి ఊరేగింపులో ఆదివారం రాత్రి 11 గంటల వరకు పాల్గొన్నాడు. డీజే చప్పుడుకు డ్యాన్స్ కూడా చేశాడు. ఆ తర్వాత ఇంటికి వెళ్లి పడుకున్నాడు. తల్లి సీతారాములమ్మ సోమవారం తెల్లవారు జామున 5గంటల సమయంలో కొడుకును నిద్రలేపడానికి ప్రయత్నించగా లేవలేదు. తన భర్తతో పాటు చుట్టుపక్కల వారిని పిలిచి పరిశీలించగా అప్పటికే మృతిచెందాడు. మృతునికి భార్య, ఏడాదిన్నర చిన్నారి ఉంది. అతని భార్య లిఖిత దసరా పండుగకు పుట్టింటికి వెళ్లి ఇంకా రాలేదు. సోమవారం వెళ్లి తన భార్యను తీసుకురావాలనుకున్నాడు.

ఇంటి ముందు నిలిపిన కారు చోరీ

మిర్యాలగూడ అర్బన్: ఇంటి ముందు పార్కింగ్ చేసిన కారును గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఈ ఘటన మిర్యాలగూడ పట్టణంలోని నందిపాడు బైపాస్ సమీపంలోని వైన్స్ పక్క వీధిలో సోమవారం ఉదయం జరిగింది. బాధితుడు రామాంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. రోజు మాదిరిగానే ఆదివారం తన స్విఫ్ట్ డిజైర్ కారులో బయటకు వెళ్లి తిరిగి ఇంటికి వచ్చిన రామాంజనేయులు ఇంటి ముందు కారును పార్కింగ్ చేశాడు. సోమవారం ఉదయం లేచి కారును శుభ్రం చేసి ఇంట్లోకి వెళ్లాడు. అనంతరం ఉదయం 10:30 గంటలకు ఇంటి బయటకు వచ్చి చూస్తే కారు కనిపించలేదు. చుట్టుపక్కల ఎంత వెతికినా కారు కనిపించకపోవడంతో మిర్యాలగూడ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గుర్తుతెలియని వ్యక్తులు కారును తీసుకెళ్తున్న దృశ్యాలు పక్కనే ఉన్న వైన్ షాపు సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ పోలీసులు పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో రెండు గేదెలు మృతి

కట్టంగూర్: విద్యుదాఘాతంతో రెండు గేదెలు మృతిచెందాయి. ఈ ఘటన కట్టంగూర్ మండల కేంద్రంలోని అంబటివాగులో సోమవారం జరిగింది. అంబటివాగుకు చెందిన ముదిరెడ్డి భద్రమ్మ రోజుమాదిరిగానే సోమవారం కూడా తన రెండు గేదెలను మేత మేపేందుకు తోలుకెళ్లింది. ఈ క్రమంలో బీసీ హాస్టల్ సమీపంలో అప్పటికే తెగిపడి ఉన్న విద్యుత్ తీగకు కరెంట్ సరఫరా కావటంతో గేదెలు ఆ తీగను తాకడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాయి. మృతి చెందిన గేదెల విలువ సుమారు రూ.1.20లక్షలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితురాలు కోరుతోంది.

7 గేట్ల ద్వారా పులిచింతల నీటి విడుదల

హుజూర్‌నగర్: పులిచింతల ప్రాజెక్టుకు వస్తున్న వరద ఉధృతి స్వల్పంగా తగ్గింది. ఆదివారం 2.22లక్షల క్యూసెక్కులుగా ఉన్న ఇన్‌ఫ్లో సోమవారం 1.83లక్షల క్యూసెక్కులుగా నమోదైంది. ప్రాజెక్టు 7 క్రస్ట్ గేట్లను 3 మీటర్లు పైకెత్తి 1.67 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ద్వారా 16వేల క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 45.77 టీఎంసీలు కాగా ప్రస్తుతం 42.16 టీఎంసీల నీరు ఉంది.

100 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి..

పులిచింతల ప్రాజెక్టులో అంతర్భాగంగా నిర్మించిన తెలంగాణ జెన్‌కో విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలోని నాలుగు యూనిట్ల ద్వారా సోమవారం 100 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసినట్లు జెన్‌కో ప్రాజెక్టు ఎస్‌ఈ దేశ్యా నాయక్ తెలిపారు.

రాజానగరంలో విషాదఛాయలు



వెంకటేశ్‌రాజు (ఫైల్)

ఆలేరురూరల్: ఆలేరు మండలం రాజానగరం గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. గ్రామానికి చెందిన జగ్గరాజు వెంకటేశ్‌రాజు(20) ఆంధ్రప్రదేశ్‌లోని గన్నవరం సమీపంలో గల లింగయాస్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. ఆదివారం స్నేహితులతో కలిసి సమీప గ్రామమైన మాదలదారిగూడెం చెరువులో స్నానం చేసేందుకు వెళ్లిన వెంకటేశ్‌రాజు నీటి మునిగి మృతిచెందాడు. అక్కడి పోలీసులు వెంకటేశ్‌రాజు మృతదేహానికి గన్నవరం ప్రభుత్వ ఆస్పత్రిలో సోమవారం పోస్టుమార్టం నిర్వహించి తల్లిదండ్రులకు అప్పగించారు.

ప్రభుత్వాస్పత్రిలో గుర్తుతెలియని వ్యక్తి మృతి



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

నల్లగొండ క్రైం: నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రిలోని అన్నపూర్ణ క్యాంటిన్ వద్ద సోమవారం గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందినట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు. మృతుడి వయస్సు సుమారు 32 సంవత్సరాలు ఉంటుందని, చామన ఛాయ రంగులో ఉన్నాడని పేర్కొన్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 8712670176ను సంప్రదించాలని సూచించారు.

బాలసదన్ ఘటనపై కేసు నమోదు



యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

భువనగిరి క్రైం: భువనగిరిలోని బాలసదన్‌లో అనాథ బాలికపై జరిగిన లైంగిక దాడికి పాల్పడిన నిందితుడిపై సోమవారం కేసు నమోదు చేసినట్లు భువనగిరి పట్టణ సీఐ సురేష్‌కుమార్ తెలిపారు. వలిగొండలోని శాంతినిలయంలో ఉంటూ చదువుకుంటున్న అనాథ బాలిక(13) దసరా సెలవుల్లో తాత్కాలిక ఆశ్రయం కోసం భువనగిరిలోని బాలసదన్‌కు వచ్చింది. ఈ నెల 14న బాలసదన్‌లో అంతర్జాతీయ బాలిక దినోత్సవం నిర్వహించగా.. వేడుకలు జరుగుతున్న సమయంలో బాలిక బాత్‌రూంకు వెళ్లి వస్తుండగా డీఎల్‌ఎస్‌ఏ అటెండర్ వెంకట్‌రెడ్డి ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక బాలసదన్ సిబ్బందికి విషయం చెప్పగా.. సోమవారం జిల్లా శిశు సంక్షేమ శాఖ అధికారి ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టి వెంకట్‌రెడ్డిని అదుపులోకి తీసుకుని జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపినట్లు సీఐ పేర్కొన్నారు.

కలెక్టర్ వినతి..

భువనగిరిటౌన్: బాలికపై జరిగిన లైంగిక దాడిపై సమగ్ర విచారణ జరిపి నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో యాదాద్రి జిల్లా కలెక్టర్ హనుమంతు కే. జండగేకు బాలల హక్కుల పరిరక్షణ వేదిక, హ్యూమన్ రైట్స్ కమిషన్, ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో బాలల హక్కుల పరిరక్షణ వేదిక జిల్లా నాయకుడు కొడారి వెంకటేష్, నేషనల్ హ్యూమన్ రైట్స్ జిల్లా అధ్యక్షుడు ఇంతియాజ్, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి ఉప్పల శాంతికుమార్, లోకేష్ తదితరులు ఉన్నారు.

బలమైన బాల్యానికి.. పంచసూత్రాలు

- పిల్లల్లో పౌష్టికాహార లోపాన్ని అధిగమించేలా కార్యాచరణ
- అంగన్‌వాడీల్లో వెయ్యి రోజుల ప్రణాళిక



తడకమళ్ల గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు

మిర్యాలగూడ టౌన్ : పిల్లల్లో పౌష్టికార లోపాన్ని నివారించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారిస్తున్నాయి. అంగన్‌వాడీల ద్వారా ఇప్పటికే గర్భిణులు, బాలింతలు, పిల్లల ఆరోగ్యం, సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తున్నాయి. అదే క్రమంలో అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం పంపిణీ చేస్తున్నా కొందరు చిన్నారులు పౌష్టికాహారం లోపంతో బాధపడుతున్నారు. వారికి సంపూర్ణ ఆరోగ్యులుగా తీర్చిదిద్దేందుకు ఉమ్మడి నల్లగొండ జిల్లాలో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ప్రత్యేకంగా వెయ్యి రోజుల కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. చిన్నారుల అభ్యున్నతికి పంచ సూత్రాల అమలుకు శ్రీకారం చుట్టింది. పోషణ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగానే దీన్ని అమలు చేస్తోంది.


పంచసూత్రాలు ఇలా..

- పుట్టిన బిడ్డకు ఆరు నెలల పాటు తల్లి ముర్రుపాలు, ఆరు నెలల తరువాత అదనపు ఆహారాన్ని అందించడం, అదే విధంగా సమయానికి వ్యాధి నిరోధక టీకాలను వేయించేలా చూస్తున్నారు. పోషణ లోపం కలిగిన చిన్నారులకు ఆకుకూరలు తదితర సమతుల్య ఆహారం అందిస్తున్నారు.
- బాల్యదశలోనే సమతుల్య ఆహారాన్ని అందించకపోతే ఎదురయ్యే ఇబ్బందులపై తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారాన్ని అందించడంతో పాటు ఇంటి వద్ద కూడా ఎలాంటి ఆహారాన్ని తీసుకోవాలో తెలియజేస్తున్నారు.
- కొంతమంది చిన్నారుల్లో రక్తహీనత సమస్య తలెత్తుతుంది. ఇలాంటి వారిని గుర్తించి పౌష్టికాహారాన్ని అందిస్తారు.
- కలుషిత నీరు, ఆహారం తదితర కారణాలతో చిన్నారులు డయేరియా బారినపడుతున్నారు. ఫలితంగా శారీరక ఎదుగుదలపై ప్రభావం పడుతుంది. నిర్లక్ష్యం వహిస్తే పరిస్థితి చేయిదాటి ప్రమాదం లేకపోలేదు. ఈ తరుణంలో తీసుకోవాల్సిన ముందు జాగ్రత్త చర్యలు, ఒకవేళ అతిసారం బారిన పడితే ముందడుగు వేయాల్సిన తీరుపై సూచనలు చేస్తున్నారు.
- శుచి, శుభ్రతను పాటించకపోతే రోగాలు ప్రబలే అవకాశం ఎక్కువ. అయితే గ్రామీణ ప్రాంతాల్లో ఈ సమస్య అధికంగా ఉంటుంది. చేతుల శుభ్రతతో ప్రయోజనాలను తల్లిదండ్రులకు వివరిస్తారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోనూ చిన్నారులు తరుచూ చేతులు శుభ్రం చేసుకునేలా ప్రోత్సహిస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో ఆరేళ్లలోపు పిల్లల వివరాలు ఇలా..

జిల్లా	ప్రాజెక్టులు	కేంద్రాలు	పిల్లలు
నల్లగొండ	9	2093	85,788
సూర్యాపేట	5	1209	43,962
యాదాద్రి	4	901	34,777

పక్కాగా అమలు చేస్తున్నాం



చిన్నారుల ఆరోగ్యంగా ఎదగాలన్న లక్ష్యంతో ముందుకు వెళ్తున్నాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో పంచ సూత్రాలు పకడ్బందీగా అమలయ్యేలా చూస్తున్నాం. పోషకలోపం ఉన్న పిల్లలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం.

– కృష్ణవేణి, జిల్లా స్త్రీ,శిశు సంక్షేమశాఖ అధికారి, నల్లగొండ